జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ ఆలయంలో మహాగౌరి అలంకరణలో అమ్మవారు

మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చిన వరంగల్ భద్రకాళి అమ్మవారు

శ్రీశైలంలో మహాగౌరి అలంకరణలో భక్తుల పూజలు అందుకుంటున్న అమ్మవారు

మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా భవానిమాత మహాగౌరి (మహిషాసురమర్దిని) రూపంలో దర్శనం

వేములవాడ రాజన్న ఆలయంలో మహాగౌరి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

హైదరాబాద్‌లో జూలూరు గౌరీశంకర్ రచించిన 'జూలూరు పథం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సీనియర్ జర్నలిస్టు కే శ్రీనివాస్, ఘంటా చక్రపాణి

## దీర్ఘకావ్యాలకు మైలురాయి 'జూలూరు పథం'

- **పుస్తకావిష్కరణలో ప్రముఖులు**

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): దీర్ఘకవితల చరిత్రలో, తెలుగు సాహిత్యంలో 'జూలూరు పథం' దీర్ఘ కావ్యం అత్యున్నత ప్రమాణాలతో చిరస్థాయిగా నిలిచిపోతుందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఆదివారం ఉదయం తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ రచించిన 'జూలూరు పథం' దీర్ఘకావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మట్లాడిన వక్తలు.. తెలుగు సాహిత్యంలో ఇప్పటివరకు వచ్చిన దీర్ఘకావ్యాల్లో అతి పెద్దకావ్యం ఇదేనని తెలిపారు. సభాధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ.. గౌరీశంకర్ ప్రగతిశీల ఉద్యమాల్లో, కుల అస్తిత్వ ఉద్యమాల్లో, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమంలో మమేకమై నిత్య చైతన్యశీలిగా నిరంతరం రచనలు చేస్తూ కొనసాగరని కొనియాడారు. ఈ దీర్ఘకావ్యం వేదన, సంక్షోభం, సంఘర్షణ, ఆక్రోశం, కన్నీళ్లు, చైతన్యాల సమ్మేళనమని చెప్పారు. ఇది జీవకావ్యం అని అభివర్ణించారు. ఆంధ్రజ్యోతి సంపాదకుడు కే శ్రీనివాస్ మాట్లాడుతూ.. జూలూరు తన జీవిత నేపథ్యం చెప్తూనే సామాజిక తెలంగాణ పరిణామం చెందుతూ వచ్చిన దశలను డాక్యుమెంట్ విధానంలో కవితాత్మకంగా అక్షరీకరించరని ప్రశంసించారు. టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. ఏకబిగిన ఆసాంతం చదివించే 'జూలూరు పథం' దాశరథి చెప్పినట్టు గాయపడిన కవి గుండెల్లో రాయబడని కావ్యంలా ఉన్నదని అన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ.. ఉక్కుపిడికిలి ఎత్తిననాడు మొదలుకొని అన్ని ఉద్యమాల్లో జూలూరు గౌరీశంకర్ చురుకైన పాత్ర పోషించాడని కొనియాడారు. జర్నలిస్టుగా, కవిగా, రచయితగా, ప్రచురణకర్తగా బహురూపాల్లో కనిపిస్తాడని, ధిక్కార సంస్కృతి నుంచి వచ్చినవాడు కావడంవల్లే దమ్మున్న కవి అయ్యాడని చెప్పారు. సభకు డాక్టర్ యాకూబ్ స్వాగతం పలికారు. సభలో ప్రఖ్యాత కవులు సీతారాం, ప్రసేన్, పులికొండ సుబ్బాచారి, సుద్దాల అశోక్‌తేజ, కుప్పిలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో వార్ వన్ సైడ్

- **మూడోసారి అధికారం బీఆర్ఎస్‌దే**
- **కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయం**
- **బీజేపీకి అన్నిటా డిపాజిట్లు గల్లంతే**
- **కాంగ్రెస్ హామీలకు గ్యారెంటీ ఎవరు?**
- **ఖర్గేను కాదని రాహుల్ గ్యారెంటీలు ప్రకటించడం ఏమిటి?**
- **సోలాపూర్‌లో బతుకమ్మ ఆడిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

మహారాష్ట్రలోని సోలాపూర్‌లో మహిళలతో కలిసి బతుకమ్మ పేర్చుతున్న ఎమ్మెల్యే కవిత

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో వార్ వన్‌సైడేనని, బీఆర్ఎస్ భారీ మెజార్టీతో మూడోసారి అధికారంలోకి రాబోతున్నదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ కొడతారని చెప్పారు. సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడానికి సోలాపూర్ వెళ్లిన కవిత స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. పదేండ్లలో రైతులు, మహిళలు, యువత, ఎస్సీ ఎస్టీ, బీసీ సాధికారత కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేసిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచి పనులే తమను గెలిపిస్తాయని అన్నారు. సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీజేపీ అన్నీ సీట్లలో డిపాజిట్ కోల్పోతుందని జోస్యం చెప్పారు.

### ఆరు గ్యారెంటీలకు ఎవరు గ్యారెంటీ?

బీఆర్ఎస్ పథకాలను కాపీ కొట్టి కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు ఏ నాయకుడు గ్యారెంటీ ఇస్తారని కవిత ప్రశ్నించారు. దళిత నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాదని గాంధీ కుటుంబం గ్యారెంటీల హామీలు ఇస్తున్నదని విమర్శించారు. తెలంగాణ సంస్కృతిని మహారాష్ట్రలో కొనసాగించడం సంతోషంగా ఉన్నదని, మహారాష్ట్ర సంస్కృతిని కూడా పాటిస్తూ అక్కడ తెలంగాణవాసులు గంగా జమున తహజీబ్‌లా కలిసిపోయారని హర్షం వ్యక్తం చేశారు.

### చేనేత, బీడీ కార్మికులతో సమావేశం

సోలాపూర్ పర్యటనలో భాగంగా ఎమ్మెల్సీ కవిత చేనేత పరిశ్రమలను సందర్శించి, కార్మికులతో మాట్లాడారు. మహారాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమకు ఎటువంటి సహాయ సహకారాలూ అందించడం లేదని వారు కవిత దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సోలాపూర్‌లో పెద్ద సంఖ్యలో ఉన్న బీడీ కార్మికులను కలిసి, కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. సోలాపూర్‌లో దాదాపు 70 వేల మంది బీడీ కార్మికులు ఉన్నారని, మహారాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులను ఆదుకునే ప్రయత్నం చేయడం లేదని వారు కవిత దృష్టికి తీసుకొచ్చారు.

### వైభవంగా బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడానికి సోలాపూర్ వచ్చిన కల్వకుంట్ల కవితకు స్థానిక నాయకులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. పట్టణంలోని పుంజల్‌మైదాన్‌లో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలతో కలిసి కవిత బతుకమ్మ ఆడారు. సోలాపూర్‌లో మధ్యాహ్నం నగేశ్‌వాల్యాల్ నివాసంలో బతుకమ్మను పేర్చారు. అనంతరం దశరథ్ గోప్ నివాసానికి వెళ్లారు. దత్త మందిర్ నుంచి మొదలైన బతుకమ్మ ర్యాలీలో కవిత మహిళలతో కలిసి నడిచారు.

## తెలంగాణ అస్తిత్వ ప్రతీక బతుకమ్మ

- **ఆడబిడ్డలకు ఐటీ, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ శుభాకాంక్షలు**

హైదరాబాద్, అక్టోబరు 22 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మహిళలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. పుడమి పులకరించే.. సింగిడి రంగుల పూల వైభవం, ప్రకృతి పరవశించే తీరొక్క వర్ణాల బతుకు సంబురం అంటూ ఆదివారం ట్వీట్ చేశారు. పువ్వులు, నవ్వులు విరబూసే సహజీవన సౌందర్యం, ఇచ్చిపుచ్చుకొనే వాయినాల అచ్చమైన ఆనంద పరిమళం, నిండిన చెరువుల నీటి అలలపై ఉయ్యాలలూగే గౌరమ్మలు అంటూ పేర్కొన్నారు. పంట చేనుల దారుల్లో పూలతేరులు, సమిష్టి సంస్కృతిని చాటిచెప్పే విశిష్ట వేడుక, తెలంగాణ అస్తిత్వ ప్రతీక, ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రానికి 100 కంపెనీల కేంద్ర బలగాలు

- **కమిషనరేట్లు, జిల్లాలవారీగా పోలీసు బలగాల కేటాయింపు**
- **సమస్యాత్మక ప్రాంతాల్లో మార్చ్‌లు**
- **'నమస్తే తెలంగాణ'తో ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్**

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్రం నుంచి 100 కంపెనీల పోలీస్ బలగాలు తెలంగాణకు చేరుకున్నాయి. ఒక్కో కంపెనీలో అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్, సశస్త్ర సీమాబల్ తదితర బలగాలకు చెందిన 60-80 మంది వరకు సిబ్బంది ఉన్నారు. కేంద్ర హోంశాఖ ఈ బలగాలను రాష్ట్రానికి పంపినట్టు శాంతిభద్రల విభాగం ఏడీజీ సంజయ్‌కుమార్ జైన్ వెల్లడించారు. ఈ బలగాను కమిషనరేట్లు, జిల్లాలవారీగా పంపిణీ చేస్తున్నామని, తొలుత సమస్యాత్మక ప్రాంతాలకు పంపిస్తామని ఆదివారం 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకొని బందోబస్తు నిర్వహించే ఈ బలగాలు కీలక ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను, సరిహద్దుల్లో తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటాయని, ఓటర్లలో భయాన్ని తొలగించేందుకు సమస్యాత్మక ప్రాంతాల్లో పలు మార్లు కవాతు (ఫ్లాగ్ మార్చ్) నిర్వహిస్తాయని వివరించారు.

### ఎన్నికల నాటికి మరో 200 కంపెనీల రాక

ప్రస్తుతం రాష్ట్రానికి చేరుకున్న 100 కంపెనీల బలగాలు కొన్ని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సొంతగా, మరికొన్ని కేంద్రాల వద్ద స్థానిక పోలీసులతో కలిసి విధులు నిర్వహించనున్నాయి. ఈవీఎంలను భద్రపరిచే కేంద్రాలు కూడా కేంద్ర బలగాల అధీనంలోనే ఉంటాయి. ఎన్నికలకు ముందు ఈవీఎంలను కేంద్రాలకు తీసుకెళ్లడం.. స్ట్రాంగ్ రూములకు తేవడం కేంద్ర బలగాల ఆధ్వర్యంలోనే జరుగుతుంది. ఈ బలగాలు డబ్బు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు చేపట్టే తనిఖీల్లోనూ పాలుపంచుకుంటాయి. కాగా, ఈసారి ఎన్నికలకు శిక్షణలో ఉన్న ఎస్సై అభ్యర్థులను కూడా తాత్కాలికంగా విధుల్లోకి తీసుకోనున్నట్టు తెలుస్తున్నది.


హైదరాబాద్‌లోని అమరుల స్మారక చిహ్నం వద్ద బతుకమ్మ ఆడుతున్న సీఎస్ శాంతికుమారి, పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీదేవి తదితరులు

కెనడాలోని హాలిఫ్యాక్స్ నగరంలో మ్యారిటైం తెలుగు అసోసియేషన్ బతుకమ్మ సంబురాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు

ఆదివారం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు వద్ద జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్

బెర్లిన్‌లో తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ జర్మనీ ఆధ్వర్యంలోని వేడుకల్లో మహిళలు

## ఘనంగా 'సద్దుల' సంబురాలు

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంతో పాటు విదేశాల్లో మహిళలు బతుకమ్మలు పేర్చి ఆటలు ఆడారు. పర్యాటక, సాంస్కృతిక శాఖలు, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణ అమర వీరుల స్మారక స్తూపం వద్ద నిర్వహించిన వేడుకల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, ఆర్థిక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి హాజరై, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. జర్మనీ, కెనడా, జపాన్ టోక్యో నగరంలోని కోమట్సుగావా పార్కులో, ఉగాండా రాజధాని కంపాలాలోని టీటీడీ ప్రాంగణంలో తెలంగాణా అసోసియేషన్ అఫ్ ఉగాండా ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు.

## శ్రీలంకలో 'గ్రీన్ చాలెంజ్'ను విస్తరిస్తా

- **బాలీవుడ్ నటి రాశిప్రభ సందీపని**

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): తాను పుట్టిపెరిగిన శ్రీలంకలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమాన్ని విస్తరించేందుకు కృషి చేస్తానని బాలీవుడ్ నటి రాశిప్రభ సందీపని పేర్కొన్నారు. సినిమా షూటింగ్‌లో భాగంగా హైదరాబాద్ వచ్చిన ఆమె ఆదివారం గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిని అర్థం చేసుకుంటే ప్రపంచంలో సమస్యలే ఉండవని పేర్కొన్నారు. శ్రీలంకలో ప్రకృతికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతోనే ఇవాళ టూరిజం పెరిగి లక్షల మందికి ఉపాధి లభిస్తున్నదని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు తగ్గాలంటే మొక్కలు పెంచడం ఒక్కటే మార్గమని తెలిపారు. ఇందులో భాగంగానే ఎంపీ సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా చాలెంజ్ అనే కార్యక్రమం ప్రారంభించడం, ఉద్యమంలా ముందుకు తీసుకుపోవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. తాను ప్రపంచలోని అనేక దేశాల్లో పర్యటించానని, అనేక మంది పర్యావరణవేత్తలను కలిశానని, కానీ, గ్రీన్ ఇండియా చాలెంజ్ లాంటి వినూత్న కార్యక్రమాన్ని ఎక్కడా చూడలేదని స్పష్టం చేశారు. ఇలాంటి అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రారంభించి కోట్లాడి మొక్కలు నాటిస్తున్న ఎంపీ సంతోష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎన్నికల్లో సోషల్ మీడియా కీలకపాత్ర

- **సామాజిక మాధ్యమాలపై ఆధారపడుతున్న నేతలు**
- **ఇదే అదునుగా భారీ ప్యాకేజీలు కోరుతున్న ఏజెన్సీలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): ఇప్పుడంతా సోషల్ మీడియా ట్రెండే నడుస్తున్నది. ఉదయం మార్నింగ్ వాక్ నుంచి రాత్రి ఇంటికి చేరంత వరకు నిత్యం ఏదో ఒక అప్‌డేట్ సోషల్ మీడియా ద్వారానే తెలుస్తున్నది. ప్రస్తుతం ఎలక్షన్ సీజన్ కావటంతో సాధారణ జనాల నుంచి పొలిటికల్ లీడర్ల వరకు అందరూ సామాజిక మాధ్యమాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. చాలామంది లీడర్లు సోషల్‌మీడియాలో తమ ఉనికిని చాటుకొనేందుకు నిపుణులను నియమించుకున్నారు. ఇట్లాంటివారి కోసం నగరంలో డిజిటల్ మీడియా ప్రమోషన్ చేసే కన్సల్టెన్సీలు, ఏజెన్సీలతోపాటు కొన్ని పొలిటికల్ స్ట్రాటజీ సంస్థలు ఆరు నెలల ముందు నుంచే పాగా వేసి, క్రమంగా కార్యకలాపాలను విస్తరిస్తున్నాయి. అయితే సోషల్ మీడియా నిర్వహణ ఖర్చులు పొలిటికల్ లీడర్లకు తడిసి మోపెడవుతుందని సమాచారం. భారీ మొత్తంలో ఉండే ప్యాకేజీలతోపాటు సిబ్బందికి లాడ్జింగ్, బోర్డింగ్ సదుపాయాలు, ఫుడ్ అలవెన్స్‌ల పేరిట భారీగా ఖర్చు చేయాల్సి వస్తుందని లీడర్లు వాపోతున్నారు. పొలిటికల్ లీడర్లకు ప్రచారం చేసేందుకు రంగంలోకి దిగిన ఏజెన్సీలు నగరంలోని పలు నియోజక వర్గాల పరిధిలో కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్నాయి. స్థానికంగా ఉండే సోషల్ మీడియా సభ్యులతోపాటు, మరికొంత మంది నిపుణులతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కార్యాకలాపాలు కొనసాగిస్తున్నాయి. అభ్యర్థికి సంబంధించిన రోజువారీ షెడ్యూల్ తోపాటు, ఆయా పార్టీల కార్యకలాపాలు, హామీలను జనాల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి.

### భారమైన ప్యాకేజీలు

రాజకీయ పార్టీలు సోషల్ మీడియాలో ఉన్న ఫాలోవర్లను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ లాంటి పార్టీలైతే అభ్యర్థులకు టికెట్ ఇచ్చేందుకు సోషల్ మీడియాలో ఇంతమంది ఫాలోవర్లు ఉండాలనే నిబంధన కూడా పెట్టినట్టు తెలిసింది. ఇది కూడా డిజిటల్ మీడియా ప్రమోటర్ల ప్రభావమేనని నేతలు భావిస్తున్నారు. దీంతో అనివార్యంగా మారిన సోషల్ మీడియాను తమ ప్రచారాస్త్రాల్లో భాగంగా చేసుకోవాల్సి వస్తున్నదని నిపుణులు పేర్కొంటున్నారు. ఇదే అదనుగా భావించిన ఏజెన్సీలు అడ్డగోలుగా వసూలు చేస్తున్నాయి. నెలకు రూ.5 లక్షల నుంచి రూ.10-12 లక్షల వరకు వసూలు చేస్తున్నాయని సమాచారం.

## స్వర్ణరథంపై మలయప్పస్వామి

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): తిరుమల వేంకటేశ్వరస్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజైన ఆదివారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి దర్శనమిచ్చారు. తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. స్వామివారిని దర్శించుకునేందుకు భారీగా భక్తజనం తరలివచ్చారు. భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ శ్రీనివాసుడి వాహన సేవ కన్నులపండువగా జరిగింది. సాయంత్రం శ్రీవారికి అశ్వవాహన సేవ నిర్వహించారు. సోమవారం శ్రీవారికి చక్రస్నానం నిర్వహిస్తారు.

- **ఓటరు చైతన్య యాత్ర**

హైదరాబాద్, అక్టోబరు 22 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ హైదరాబాద్‌లోని హుడాకాలనీకి చెందిన మంతెన శ్రీనివాసరాజు రాష్ట్రవ్యాప్తంగా బైక్‌యాత్ర చేస్తున్నారు. తన బైక్‌కు ఫ్లెక్సీలు, బ్యానర్లు పెట్టి ఓటు ప్రాధాన్యత తెలుపుతున్నారు. ఓటర్లకు అభ్యర్థులపై వ్యతిరేకత, ఇష్టం లేకుంటే నోటాకు అయినా ఓటు వేయాలని, కానీ ఓటింగ్‌లో మాత్రం పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## 45కి చేరిన కిలో ఉల్లిగడ్డ

- **బహిరంగ మార్కెట్లో కిలో రూ.45**
- **రాష్ట్రంలో పడిపోయిన సాగు**
- **ధరలు మరింత పెరిగే అవకాశం**

హైదరాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ): కొంతకాలంగా నిలకడగా ఉన్న ఉల్లి ధరలు మళ్లీ పెరగడం సామాన్యులను కలవరపాటుకు గురిచేస్తున్నది. మార్చిలో రూ.15 ఉన్న కిలో ఉల్లిధర ప్రస్తుతం 45-50కి పెరిగింది. మున్ముందు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. హైదరాబాద్‌లో నిన్న మొన్నటి వరకు కిలో ఉల్లి 30-35 మధ్య ఉండగా ప్రస్తుతం 45 దాటేసింది. కొన్నిచోట్ల 50కి విక్రయిస్తున్నారు. రైతు బజార్లలో ఈ ధర 40గా ఉంది. సాధారణంగా ఏపీ, హైదరాబాద్‌కు కర్ణాటక నుంచి ఉల్లి దిగుమతి అవుతుంది. ఈసారి వర్షాలు ఆలస్యం కావడంతో ఉల్లిసాగు దాదాపు 120 రోజులు ఆలస్యమైంది. ఇది సరఫరాపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు హైదరాబాద్ వ్యాపారులు మహారాష్ట్ర నుంచి ఉల్లి దిగుమతి చేసుకుంటున్నారు. నవంబర్ మొదటి వారం నుంచి కొత్త ఉల్లి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని, అప్పుడు ధరలు కొంత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొన్నారు.

### 5.08 లక్షల టన్నుల వినియోగం

రాష్ట్రంలో ఉల్లి ఉత్పత్తి తగినంత లేకపోవడంతో ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సి వస్తున్నది. ఇక్కడి వ్యాపారులు ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, ఎంపీ నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుంటున్నారు. రిటైల్ మార్కెట్లో ఉల్లి ధర వారం రోజుల్లోనే 25 నుంచి 45కు పెరిగింది. మార్కెటింగ్‌శాఖ గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో ఏడాదికి 5.08 లక్షల టన్నుల ఉల్లిని వినియోగిస్తున్నారు. అంటే నెలకు సగటున 42,400 టన్నుల ఉల్లిగడ్డను వినియోగిస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 2.5 లక్షల టన్నుల లోపే పండుతుండటంతో ఇతర రాష్ట్రాల నుంచి మార్కెటింగ్‌శాఖ ఉల్లిని సేకరిస్తున్నది. ఈ ఏడాది సాధారణ విస్తీర్ణంలో 9,405 ఎకరాలకు గాను కేవలం 92 ఎకరాల్లోనే ఉల్లి సాగు చేశారు. రాష్ట్రంలోని ఉల్లి ఉత్పత్తిలో 80 శాతం మహబూబ్‌నగర్ జిల్లాలోనే సాగవుతుండగా ఈసారి అక్కడ ఉల్లిసాగు గణనీయంగా పడిపోయింది. రాష్ట్రంలోనే అతిపెద్ద ఉల్లి మార్కెట్ అయిన మలక్‌పేటకు ఇతర రాష్ట్రాల నుంచి రోజుకు 10,000 క్వింటాళ్ల ఉల్లి వస్తుండగా ప్రస్తుతం ఇది 5,000 క్వింటాళ్ల కంటే తక్కువకు పడిపోయింది. మున్ముందు దిగుమతులు మరింత పడిపోయే అవకాశం ఉందని, అదే జరిగితే మార్చి నాటికి ఉల్లి కొరత తీవ్రమై కిలో రూ. 70-80కి చేరుకునే అవకాశం ఉందని మార్కెటింగ్ వర్గాలు పేర్కొన్నాయి.